క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఎంఈఓ గోపాల్‌నాయక్

ఎన్‌పీకుంట: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి గోపాల్‌నాయక్ భోజన ఏజన్సీ నిర్వాహకులకు సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల (మెయిన్ స్కూల్) ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతోపాటు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, ఉపాధ్యాయుడు లాలూసాబ్ ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడండి

ముదిగుబ్బ: మండల కేంద్రంలో వారపు సంత సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సీఐటీయూ నాయకులు సీఐ యతీంద్రకు వినితపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారపు సంతలో రోడ్లపై తోపుడు బండ్లు పెట్టుకోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తోపుడు బండ్లను మరోచోట పెట్టుకునేలా చూడాలని సీఐటీయూ నాయకులు పెద్దన్న, రంగనాయకులు తదితరులు కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్

ముదిగుబ్బ: స్థానిక వైకేపీ కార్యాలయంలో గురువారం ఏపీఎం హేమలత ఆధ్వర్యంలో వీఓఏలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగాగా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ బ్యాంకులు అందించే రుణాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితర వాటిని తెలియజేశారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రవి, వైకేపీ సీసీలు, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు బి.గోపాల్, మునిరాజ్, వీఓఏలు పాల్గొన్నారు.

యువకుడి నిజాయితీ



ఆజాద్‌కు సెల్‌ఫోన్‌ను అందిస్తున్న పోలీసు

ముదిగుబ్బ: ఓ యువకుడు తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు..మండలంలోని పాముదుర్తి క్రాస్ వద్ద గురువారం ఆజాద్ అనే యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. గోపీకృష్ణ అనే యువకుడికి అది దొరికింది. వెంటనే అతడు దాన్ని ముదిగుబ్బ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం విచారణ చేసి సెల్‌ఫోన్‌ను ఆజాద్‌కు అప్పగించారు. ఈసందర్భంగా గోపీకృష్ణను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



పెద్దమౌలాలీ పీరును ఊరేగిస్తున్న గ్రామస్తులు

గాండ్లపెంట: మండలంలోని వేపరాల గ్రామంలో గురువారం మొహర్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముజావర్లు పెద్ద మౌలాలి పీర్లను పూలతో అలంకరించి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు పీర్లకు చదివింపులు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపును తిలకించేందుకు వేపరాల పంచాయతీ పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: స్థానిక సాయినగర్ శ్రీ షిరిడిసాయిబాబా ఆలయంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు పేదలు, భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి గురువారం ఆలయానికి వచ్చే భక్తులతోపాటు పేదలకు అన్నదానం చేస్తున్నట్లు వారు తెలిపారు.

మెలకువలతోనే లాభాలు వరించె

- నారు మడుల్లో రైతులు బిజీ
- ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బోరు బావులు, నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే చాలామంది అంచనా మేరకు సరిపడా బీపీటీ, స్వర్ణ వరి నారుమళ్లు పోసుకుంటున్నారు. మెలకువలు పాటిస్తేనే ఆరోగ్యకరమైన నారుతో అధిక దిగుబడులు వస్తాయని బత్తలపల్లి వ్యవసాయాధికారి ఓబిరెడ్డి చెబుతున్నారు. ప్రధానంగా వరి నారు పెంపకం, నాట్ల విషయంలో పాటించాల్సిన మెలకువలను వివరించారు.

అనువైన రకాల ఎంపిక..

వాతావరణ పరిస్థితులకు అనువైన వరి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆ రకాలు అధిక దిగుబడినిచ్చే, అధిక ఎరువుల వినియోగ సామర్థ్యం కలిగి ఉండాలి. ముఖ్యంగా రకాన్ని బట్టి నత్రజని ఆవశ్యకత ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు స్వర్ణ వరి రకానికి తక్కువ నత్రజనితో ఎక్కువ దిగుబడిని ఇవ్వగల శక్తి ఉంటుంది. అటువంటి రకాలకు తక్కువ మోతాదులో నత్రజని ఎరువులను ఉపయోగించాలి. ఆహార పంటలకు, దుంపజాతి పంటలకు నత్రజని ఎరువుల అవసరం ఎక్కువగా ఉంటుంది. పప్పు జాతి పంటలకు వేర్లపై ఉండే బుడిపెలలో ఉన్న బ్యాక్టీరియా వల్ల నత్రజని స్థిరీకరణవుతుంది. అందువల్ల నత్రజని తక్కువగా ఉంటుంది.

ఆరోగ్యవంతమైన నారు పెంపకం ఇలా..

- వరి నారు పెంచదల్చిన వారు మడిని 10–12 రోజుల వ్యవధిలోనే మూడు దఫాలుగా దమ్ముచేసి పొలాన్ని చదును చేసుకోవాలి. నారు మడిలో నీరు పెట్టడానికి, తీయడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లడానికి ముందు, మరో కిలో విత్తనం నారుమడిలో చల్లిన 12–14 రోజులకు, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు వేసుకోవాలి.
- మొలక కట్టిన వరి విత్తనాన్ని సెంటు పొలంలో 5 కిలోల చొప్పున చల్లుకోవాలి.
- నారు ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తర్వాత నీరు పలుచగా నిలవకట్టాలి.
- పొలంలో జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- విత్తనం చల్లిన పది రోజులకోసారి, 17 రోజులకు రెండోసారి మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలి. నాట్లు వేయడానికి వారం రోజుల ముందు 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటు నారుమడిలో తక్కువ నీరు ఉండే విధంగా చూసుకొని చల్లుకోవాలి.



పోట్లమర్రి వద్ద నారుమడి



ఓబిరెడ్డి (వ్యవసాయాధికారి)

పొలాన్ని దమ్ము చేసుకోవాలి

వరి నాట్లు వేయడానికి 15 రోజుల ముందే పొలాన్ని దమ్ము చేయడం ప్రారంభించి 2–3 పర్యాయాలు మురిగే విధంగా దమ్ము చేసుకోవాలి. మడిలోని పొలమంతా నీరు అవలీలగా తిరిగే విధంగా గొర్రుతో గానీ, చెక్కతో గానీ చదును చేసుకోవాలి. నల్ల రేగడి పొలాల్లో మాత్రం నాట్లు వేయడానికి రెండు రోజులు ముందే పొలాన్ని దమ్ము చేసుకొని ఉండాలి.

నాట్లు వేయడంలో మెలకువలు

నాట్లు వేయడానికి నారు మడి నుంచి నారును తీసేటప్పుడు లేతాకు పచ్చగా ఉంటేనే మూన త్వరగా తిరగబడుతుంది. నాటడానికి 4–6 ఆకులు ఉన్న నారును మాత్రమే ఉపయోగించాలి. ముదురు ఆకులున్న నారు నాటితే దిగుబడి తగ్గిపోతుంది. పొలంలో నారును పైపైన నాటు పెడితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది. భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరు పొలంలో 33 మూనలు ఉండే విధంగా నాట్లు వేసుకోవాలి. నాట్ల మధ్యలో ప్రతి రెండు మీటర్లు ఎడమలో 20 సెంటీమీటర్ల కాలి బాటలు వదులుకోవాలి. బాటలు తీయడంతో పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంత వరకు అదుపులో ఉంటుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీ, కలుపు మందులు వేయడానికి బాటలు బాగా ఉపయోగపడతాయి.

రైల్వే సలహా కమిటీ సమావేశం



స్టేషన్ మాస్టర్‌తో సమావేశమైన కమిటీ చైర్మన్, సభ్యులు

కదిరి టౌన్: కదిరి రైల్వే స్టేషన్ మాస్టర్ కృష్ణమూర్తి అధ్యక్షతన గురువారం రైల్వే సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైల్వే సలహా కమిటీ చైర్మన్ డీఎల్ ఆంజనేయులు మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో నిమిషం పాటు మాత్రమే రైళ్లను ఆపుతున్నారన్నారు. ఇక నుంచి కనీసం ఐదు నిమిషాలపాటు రైలు నిలపాలన్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ రూం సౌకర్యం కల్పించాలన్నారు. దివ్యాంగులకు వీల్‌చైర్ ఏర్పాటు చేయాలని కోరారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. కమిటీ సభ్యులు మేకల నాగార్జున, రియాజ్, మహమ్మద్, తిమ్మరాజు, మంగళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష



ఉట్ల పరుషను తిలకిస్తున్న ప్రజలు

బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామంలో గురువారం మొహర్రంలో భాగంగా ఉట్ల పరుష ఉత్సాహంగా సాగింది. పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన దాదాపు 30 అడుగుల ఎత్తయిన ఉట్లమానును ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. చివరకు షణ్ముక అనే యువకుడు ఉట్లమాను ఎక్కడంతో గ్రామస్తులు అతడిని అభినందించారు. ఉట్ల పరుషను తిలకించేందుకు పెద్దసంఖ్యలో జనం తరలించారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవార్లు పెద్ద కాశీంస్వామి, చిన్న కాశీంస్వామి పీర్ల గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం పీర్లు జలధికి వెళ్లనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ధర్మవరం అర్బన్: పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు గురువారం తెలిపారు. టెస్ట్ పాసైన విద్యార్థులు పాలిసెట్‌లో అర్హత పొందనప్పటికీ స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 29లోపు తమ దరఖాస్తుతోపాటు సంబంధిత సర్టిఫికెట్లు జిరాక్స్‌లను జత చేసి కళాశాలలో సమర్పించాలని తెలిపారు. పాలిసెట్ 2024 హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్క్స్ కార్డు, పదో తరగతి టీసీ, 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఆయా హైస్కూల్ హెచ్‌ఎం జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 ప్రాసెసింగ్ ఫీజు, అర్హత సాధించని వారు రూ.1100, సీటు పొందినవారు రూ.4700 కళాశాలలోనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు మూడు సెట్లు జిరాక్స్ తప్పకుండా తీసుకురావాలన్నారు. కళాశాలలో డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్(డీసీఎంఈ), డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(డీఈసీఈ) కోర్సులు ఉన్నాయన్నారు. స్పాట్ అడ్మిషన్లు సీటు పొందిన వారికి ఎలాంటి స్కాలర్‌షిప్ వర్తించవని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్

ధర్మవరం అర్బన్: సీజనల్ వ్యాధులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో గురువారం ధర్మవరం సబ్ డివిజన్ మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సీజనల్ వ్యాధుల నివారణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. విషజ్వరాలు రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డయేరియా బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వైద్యం చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కనగానపల్లి: వ్యవసాయ పొలాలకు అందించే విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న కోతలు, సమస్యలు పరిష్కరించాలంటూ మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ ముందు గురువారం రైతులు ఆందోళన నిర్వహించారు. మండలంలో మండలంలోని చంద్రశ్చర్ల, దాదులూరు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి విద్యుత్ సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను సిబ్బందికి తెలిపారు. మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని దాదులూరు ఫీడర్ కింద ఉన్న గ్రామాల వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా సక్రమంగా కావటం లేదని వాపోయారు. అయితే సిబ్బంది స్పందించకపోవడంతో సబ్‌స్టేషన్ ముందు ఉన్న రహదారిపై ఆందోళనకు దిగారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఏడీ నాగేంద్ర, ఏఈ జీనాద్ రైతులతో మాట్లాడారు. గాలి కాలంలో విద్యుత్ లైన్లు సరిగా నిలవకపోవటంతో విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతోందన్నారు. చర్యలు చేపట్టి బోరుబావులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

గోరంట్ల: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి ఆఖరు వరకూ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణములో అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.9,16,93,824 నిధులతో 1,916 పనులను చేపట్టినట్లు ఉపాధి హామీ సిబ్బంది వివరించారు. అందులో రూ.46,397 అవినీతి జరిగినట్లు నిర్ధారించి సంబంధిత సిబ్బందితో రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జయేంద్రప్రసాద్ , ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఉపాధి హామీ విజిలెన్స్ అధికారులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కుప్పకూలిన టెంటు.. తప్పిన ప్రమాదం

ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కోసం ఏర్పాటు చేసిన షామియానా టెంటు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో టెంటు కింద భాగంలో ఉన్న అధికారులు అవాక్కయ్యారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో హిందూపురం జట్టు ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో 23, 24, 25వ తేదీల్లో జరిగిన ఫుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో కర్నూలు జట్టుపై శ్రీ సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించిందని చెప్పారు. అనంతరం తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి బీకే మహమ్మద్ సలీమ్, కోచ్ అయిషా, మేనేజర్ మౌనికను అభినందించారు.

లేబర్ ఆఫీసు ధర్మవరంలో ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం అర్బన్: లేబర్ ఆఫీస్‌ను ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ ఆయూబ్‌ఖాన్ కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ధర్మవరం ప్రాంతంలో అసంఘటిత కార్మికులు దాదాపు 20 వేల మందికిపైగా ఉన్నారన్నారు. గతంలో ధర్మవరంలో లేబర్ ఆఫీస్, లేబర్ కోర్టు ఉండేదన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటైన అనంతరం ధర్మవరంలోని లేబర్ ఆఫీస్‌ను కొత్తచెరువుకు తరలించారన్నారు. కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 4 కోడ్‌లుగా కుదించి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అధికారం రాకమునుపు కార్మికులకు ఇచ్చిన హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ, మున్సిపల్, ఆశా, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో కార్మికులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు రఫీ పాల్గొన్నారు.

ఆర్డీటీ క్రికెట్ విజేతలకు అభినందనలు



ఫైనల్లో గెలుపొందిన జట్టుతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బత్తలపల్లి: మండలస్థాయి ఆర్డీటీ–ఎఫ్‌వీఎఫ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన రామాపురం ఉన్నత పాఠశాల జట్టుకు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫైనల్‌లో గెలుపొందిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో మానసికోల్లాసంతో పాటు శరీరం దృఢత్వం ఏర్పడుతుందన్నారు. అంతకుముందు ఫైనల్లో గెలుపొందిన కప్పు, సాధించిన పతకాలతో పాఠశాల నుంచి రామాపురం గ్రామ పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యా సామగ్రి పంపిణీ



నోట్ బుక్కులను చూపుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్కులను పంపిణీ చేశారు. సత్యసాయిబాబా భక్తుడు సాయి శివానంద పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న 30 మంది విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయుడు నాగభూషణ, చంద్రశేఖర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు గ్రామస్తుల చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు.

వ్యవసాయ మోటర్లకు మీటర్ల ప్రతిపాదన రద్దు చేయాలి

పుట్టపర్తి టౌన్: ల్యాండ్ టైటిల్ యాక్ట్ తరహాలో రాష్ట్రంలో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనను రద్దు చేస్తూ శాశనసభలో తీర్మానం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు అడపాల వేమనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై అసెంబ్లీలో చర్చ జరగ్గా చట్టం అద్భుతంగా ఉందని పొగిడారని, తర్వాత దానిపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో యాక్టునే రద్దు చేశారని గుర్తు చేశారు. అలాగే వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు బిగించే బిల్లు రద్దుకు తీర్మానం చేసి పంపాలని కోరారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రెండు నల్లచట్టాలను తీసుకొచ్చిందని, రైతులు ఉరి తాళ్లుగా మార్చే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు అసెంబ్లీలో రద్దు చేసి తీర్మానం పంపాయని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కూడా అదే తరహాలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పదోన్నతులు కల్పించాలని వీఆర్‌ఏల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు

నల్లమాడ: అర్హత ఉన్న వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ మండలంలో పనిచేస్తున్న వీఆర్‌ఏలు గురువారం తహసీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో రికార్డు రూములకు కాపలాదారులుగా వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు వేస్తున్నట్లు తెలిపారు. కొన్ని జిల్లాల్లో వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించి ఆయా విధుల్లో నియమించినట్లు పేర్కొన్నారు. తమకు కూడా అర్హతను బట్టి వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్లుగా పదోన్నతి కల్పించి నైట్ డ్యూటీలు వేయాలని వీఆర్‌ఏలు కోరారు.

వాల్మీకి సంఘం మీడియా వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా కేశప్ప



పుట్టపర్తి టౌన్: వాల్మీకి బోయ సంఘం మీడియా వింగ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన జీమాను కేశప్ప నియమితులయ్యారు. ఈమేరకు స్టేట్ కమిటీ గురువారం నియామక పత్రం అందజేసింది. స్టేట్ మీడియా వింగ్‌లో అవకాశం కల్పించిన స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు,సెక్రటరీ క్రాంతి నాయుడు, స్టేట్ జాయింట్ సెక్రటరీ కేశవకు కేశప్ప ధన్యవాదాలు తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిమర్రి: రామాపురం గ్రామం సమీపంలో గురువారం పోలీసులు ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. గ్రామం సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్‌ఐ ఎం.నాగస్వామి సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. గ్రామానికి చెందిన మంగపత్త ఆట నిర్వాహిస్తున్న పాల్‌రాజ్‌తో పాటు మరో ఐదుగురు పట్టుపడ్డారు. వారి నుంచి రూ.10,800 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని జూదర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ వన్నప్ప, హెచ్‌సీ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.